# కర్నూలు | నంద్యాల

# వార్త

13 మే 2026 గురువారం పేజీలు 4


# కర్నూలు సర్వజన ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూలు హాస్పిటల్ మే 13 ప్రభాతవార్త :** కర్నూలు సర్వజన ఆసుపత్రిలో ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి పలు అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు సూచనలు జారీ చేశారు. మార్చురీలో సేవలు అందిస్తున్న వారికి ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకాలు కల్పించి ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు కాకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న పాత ఏసీలను దశలవారీగా మార్చాలని, అవసరమైన చోట ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్లను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. వెంటిలేటర్లు, లైఫ్ సపోర్ట్ పరికరాలు, బెడ్లు, ట్రాలీలు తదితర అవసరమైన సామగ్రిని సమకూరుస్తామని మంత్రి తెలిపారు. ఆసుపత్రిలోని జనరేటర్లు సమర్థంగా పనిచేయాలని, సీసీటీవీ పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. పాత శుశ్రుత భవనంలోని సేవలను త్వరగా కొత్త ఐపిడి భవనానికి మార్చాలని, విశ్రాంతి సదన్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి భరత్ గుప్తా పేర్కొన్నారు.

---





# ఏసీబీ వలలో.. అవినీతి చేపలు..!

**: వ్యవసాయ శాఖ పై ఏసీబీ దాడులు**
**: లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు**
**: పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు**

2లో

**ఎమ్మిగనూరు క్రైం, మే 13 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. అవినీతి శాఖ దాడులు జరుపుతున్నా అవినీతి అధికారులు ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ కొందరు ఉద్యోగులు తమ చేతివాటాన్ని మార్చుకోలేకపోతున్నారు. సులభంగా సంపాదించాలనే అత్యాశతో రకరకాల అక్రమ మార్గాలతో ప్రజల్ని ముప్పు తిప్పలు పెడుతూ తమ అవినీతి సామ్రాజ్యాన్ని నలువైపులా విస్తరించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఏసిబి అధికారులు పలు మండలాల్లో దాడులు నిర్వహించి పలువురు అక్రమార్కులను పట్టుకున్నా అవినీతికి అలవాటుపడ్డ కొందరు ఉద్యోగుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ఫలితంగా సామాన్య ప్రజలకు కష్టాలు, తిప్పలు తప్పడం లేదని చెప్ప వచ్చు. అంతులేని అవినీతి చిట్టా.. అడుగడుగునా అక్రమార్కులే.. కోట్లకు పడగలెత్తుతున్న అవినీతి అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఉద్యోగులకు చరమగీతం పలికేందుకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసింది. ఏ ఏ శాఖలో అవినీతి పేరుకుపోయిందో అలాంటి శాఖల జాబితాను కూడా ముందస్తుగా హెచ్చరికలు కూడ జారీ చేసింది. ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయరాదని స్పష్టంగా పేర్కొన్నారు. అంతేగాక ఎవరైనా అవినీతికి పాల్పడిన ఏసిబికి సమాచారం ఇవ్వాలని బహిరంగంగానే ఇటు ప్రభుత్వం అటు ఏసిబి అధికారులు ప్రకటనల ద్వారా పేర్కొంటున్నారు. అయినప్పటికి ప్రతినిత్యం లంచాల ముసుగులో....

---

# పాలు కరువు.. మద్యం కొలువు..!

- డివిజన్ పరిధిలో యథేచ్ఛగా బెల్టు షాపులు ...
- పట్టణ ,గ్రామాల్లో పాలు కరువు ...
- ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాలు కొలువు ...
- మామూళ్ల మత్తులో పాలక వర్గం ..!
- బెల్టు నిర్వహిస్తే బెల్టు తీస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు బేఖాతరూ...
- తూతూ.. మంత్రంగా ఎక్సైజ్ శాఖ దాడులు ..?



**డివిజన్ పరిధి పట్టణ, మండల స్థాయిలో రామ రమి 60 నుండి 75 మధ్యన ప్రభుత్వం నుండి అనుమతులు పొందిన మద్యం దుకాణాలు ఉండగా .. ఒక్కో మద్యం దుకాణం కింద 10 నుండి 15 బెల్టు దుకాణాలు వందల సంఖ్యలో పుట్టగొడుగుల్లా ఉన్నాయని డివిజన్ స్థాయిలో కోడై కూస్తుంది .ఉదయం పూట పాలు దొరుకుతాయో లేదో కానీ ,సూర్యుడు రాకముందే బెల్టు దుకాణాలు మాత్రం తెరిచే ఉంటాయి. డివిజన్ పరిధి వీధి వీధినా ,వాడవాడలా , పల్లే పల్లెలో గుడి దగ్గర ,బడి దగ్గర , ఆఖరికి ప్రభుత్వ కార్యాలయాల పక్కన సైతం మద్యం ఏరులై పారుతుంటే. ప్రభుత్వం ,పాలక వర్గం ,ఎక్సైజ్ శాఖ దాడులు చేయాల్సింది పోయి ,ఎంకరేజ్ చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు**

• వివరాలు 2లో

**ఆదోని, మే13, ప్రభాతవార్త ప్రతినిధి;** ప్రజలు ముఖ్యంగా మహిళలు వారి ఇంటి సమీపంలో బెల్టు షాపుల వద్ద మద్యం బాబులు చేస్తున్న ఆగడాలకు విసుగెత్తి ఫిర్యాదులు చేసినా ? రాష్ట్రేతర మద్యం అమ్ముతుంటే చెప్పండి దాడులు చేస్తాము ,మన ఆంధ్రా మద్యమే కదా సర్దుకొండని ఎక్సైజ్ శాఖ సిబ్బంది అధికారులు చెబుతుండటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లైసెన్సు లు కలిగిన వారు ఎవరైనా సరే మీరు కానీ,మీ సహచరులు, అనుచరు లతో బెల్టు షాపులు నిర్వహిస్తే ? లైసెన్సులు రద్దు చేసి బెల్టు తీస్తామని హెచ్చరికలు జారీ చేసినా పాలకులు ,ఎక్సైజ్ ,పోలీసు శాఖ మాత్రం అమ్యామ్యలకు అలవాటు పడి చోద్యం చూస్తూ మామూళ్ల మత్తులో తిగుతున్నారు కానీ దాడులు మాత్రం శూన్యం ...పాలకవర్గం మామూళ్ల .. ముక్యంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న పట్టణ ,గ్రామాల్లో పాలకులు వారి షాడో పీ ఏ ల ద్వారా ఒక్కో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వారితో 50 వేల రూపాయలు డిపాజిట్ లు తీసుకుని , వారికి సంబంధించిన మద్యం దుకాణంలో అదనంగా 10 రూపాయలు కొనుగోలు చేసేలా వారిని వెనకనుండి భుజం తట్టి నడిపిస్తున్నారని డివిజన్ స్థాయిలో బలమైన సమాచారం. ఆ బెల్టు షాపుల జోలికి ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడరు .మామూళ్ల ఇవ్వలేని వారి బెల్టు దుకాణంపై అధికారులతో దాడులు చేయించి కేసులు పెట్టిస్తున్నారని తెలుస్తుంది ...ఎక్సైజ్ అధికారుల దాడుల తీరు .. డివిజన్ పరిధి పట్టణ బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ దాడులు మాత్రం శూన్యమని చెప్పొచ్చు. వారి దృష్టిలో రాష్ట్రేతర మద్యం విక్రయించడం మాత్రం నేరంగా పరిగణించబడుతుంది కానీ , బెల్టు దుకాణాల్లో అమ్మే మద్యం అనుమతులు ఉన్నాయి అన్న చందంగా ప్రవర్తిస్తున్నారు. వందలకొద్దీ ఫిర్యాదులు ఒక్కో స్టేషన్ పరిధిలో వచ్చినప్పటికీ కేసులు మాత్రం చేతి వేళ్ళంతా కూడా...

---

## మంత్రాలయంలో
# భారీ అగ్ని ప్రమాదం..!

- పేలిన సిలిండర్లు... కాలిన సామాన్లు
- తృటిలో తప్పిన ప్రాణాపాయం
- పలువురు ఆర్థిక సాయం అందజేత
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పీఠాధిపతి





**మంత్రాలయం, మే 13, ప్రభాతవార్త;** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మూడు సిలిండర్లు



పేలగా కార్మికులకు తీవ్ర నష్టం జరిగింది. అదృష్టవశాత్తు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల మేరకు... మంత్రాలయం లోని శ్రీమఠం భవనాల్లో పనిచేయడానికి సుమారు 50 మంది కార్మికులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి షెడ్లలో నివాసం ఉంటున్నారు. అయితే ప్రమాదవశాత్తు షెడ్లలో ఉన్న సిలిండర్లు మూడు వరుసగా పేలిపోయాయి. దీంతో అగ్నికీలకలు ప్రమాదకర స్థాయిలో ఎగిరిపడ్డాయి. ఈ సంఘటనలో కార్మికుల దుస్తులు, వంట సామగ్రి, తినుబండారాలు, రేకులు, పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అధికారులు మంటలను ఆర్పి వేశారు. సంఘటనా స్థలాన్ని శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు పరిశీలన చేశారు. కార్మికులకు ఎంపీటీసీ మేకల వెంకటేష్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్యాస్ సిబ్బంది మిగతా అధికారులు రూ.5 వేలు సాయం ఆర్థిక సాయం అందజేశారు. వీరి వెంట సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

# కాబోయే వధూవరులకు బంగారం పుస్తెలు, పట్టు వస్త్రాలు పంపిణీ



**కర్నూలు సీటీ మే 13 ప్రభాతవార్త :** మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని, మే 16 తేదీన వివాహం చేసుకుంటున్న జంటలకు ఈరోజు టీజీ వెంకటేష్ స్వగృహంలో పట్టు వస్త్రాలు, కాళీ మెట్టెలు, బంగారు తాళిబొట్టు పంపిణీ చేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం 60 జంటలు మే 16న వివాహంతో ఒక్కటి కానున్నారు. వీరందరికీ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ గారి సతీమణి శ్రీమతి రాజ్యలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గారి సతీమణి శ్రీమతి శిల్పా భరత్ గార్లు ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను, తాళిబొట్టు, కాళీ మెట్టలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా మే 16న ఒక్కటయ్యే వారికి తమ కుటుంబం నుంచి సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. వివాహం చేసుకుంటున్న ప్రతి జంటకి 80 వేల రూపాయల నగదు, 20 వేల రూపాయల విలువైన తాళిబొట్టు, కాలిమెట్టలతో పాటు పట్టువస్త్రాలు కూడా అందజేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగుతుందని టీజీ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టివివి ట్రస్ట్ మ్యారేజెస్ కోఆర్డినేటర్లు వాయుగండ్ల సుబ్బారావు, దాశెట్టి శ్రీనివాసులు, విటల్ శెట్టి, ఉమామహేశ్వరరావు, జవహర్ బాబులతో పాటు నూతన వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన

**రూ.10 కోట్ల పెట్టుబడులతో శ్రీ మాత్రే ఫుడ్స్ ఆధునిక యూనిట్ ఏర్పాటు**



**కర్నూలు హాస్పిటల్ మే 13 ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా గుట్టపాడు ఎంఎస్ఎంఈ పార్క్‌లో శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక రైతులకు మార్కెట్ అవకాశాలు, యువతకు ఉపాధి కల్పనే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం రూ.50 వేల కోట్ల పెట్టుబడుల దిశగా ప్రభుత్వ కృషి రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం కారణంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే రిలయన్స్ వంటి సంస్థలు ఈ ప్రాంతంలో ప్లాంట్లు ఏర్పాటు చేశాయని, రాను న్న రోజుల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌గా ఎదిగి వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అరటి, జామ, ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం రైతులకు మార్కెట్ - యువతకు ఉపాధి అవకాశాలు శ్రీ మాత్రే ఫుడ్స్ డైరెక్టర్ పి. వేదవ్యాస్ రెడ్డి మాట్లా డుతూ, పర్యావరణ హిత విధానాలతో ఆధునిక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. అరటి, జామ, ఫ్రూట్ పల్ప్ తదితర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించనున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 25 మందికి ఉపాధి లభించడంతో పాటు వందలాది మంది రైతులు, అనుబంధ రంగాల వారికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని పేర్కొన్నారు.

---

# వ్యర్థాల నిర్వహణపై.. ప్రత్యేక దృష్టి పెట్టండి

**: ప్రతి మున్సిపాల్టీ, నగర పంచాయతీ, గ్రామ పంచాయతీలో శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు ఆదేశాలు**
**: పరిశుభ్రమైన జిల్లానే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు**



**కర్నూలు, మే 13, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మున్సిపాల్టీ, నగర పంచాయతీ, గ్రామ పంచాయతీలో సాలిడ్ మరియు లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిస్పోజల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అంశంపై అన్ని రాష్ట్రాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, స్థానిక సంస్థల పరిధిలో ఉత్పత్తి అయ్యే చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా ద్రవ వ్యర్థాల నిర్వహణకు అవసరమైన ఇంకుడు గుంతలు, డ్రైనేజీ వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పరిశుభ్రమైన జిల్లానే ప్రధాన లక్ష్యంగా తీసుకుని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి. వెంకట కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ట్రాఫిక్ ఎస్ఐ సర్వీస్ నుంచి డిస్మిస్

**: మహిళ పై వేధింపుల వివాదమే కారణం**



**కర్నూలు, మే 13, ప్రభాతవార్త :** కర్నూలు నగరంలో ట్రాఫిక్ ఎస్ ఐగా పని చేస్తున్న హరిప్రసాదును డిస్మిస్ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐకి వివాహమై పిల్లలు ఉన్నప్పటికీ మరో యువతితో వివాహేతర సంబంధం కొనసాగించారు. దీనిపై యువతి కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు హరిప్రసాదును విధుల నుంచి తొలగించారు.వైఎస్సార్ కడప జిల్లా రాజు పాలేనికి చెందిన హరిప్రసాద్ 2012లో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిం చారు. పది రోజుల క్రితం నంద్యాల జిల్లా నుంచి కర్నూలు ట్రాఫిక్ విభాగానికి బదిలీపై వచ్చారు. హరిప్రసాదుకు యువతితో వివాహేతర సంబంధం విషయంలో రెండు నెలలుగా ఇరు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతోంది.

• వివరాలు 2లో

# దేవాలయ పునః నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

**కర్నూలు అర్బన్ మే 13 ప్రభాతవార్త :** కల్లూరు అర్బన్ 33వ వార్డు పాత కల్లూరు ఊరు వాకిలి వద్ద ఉన్న శ్రీ ఈశ్వర, వీరభద్ర స్వామి వారి దేవాలయ పునః నిర్మాణ భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం మరియు స్థానిక ప్రజల సహకారంతో అన్ని విధాలుగా కృషి చేస్తామని ఆమె తెలిపారు. దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# భక్తులకు రాఘవేంద్రుడి నిజరూప దర్శనం



**మంత్రాలయం టౌన్, మే 13 ప్రభాతవార్త :** శ్రీ రాఘవేంద్ర స్వామి వారి కొలువై ఉన్న పుణ్యక్షేత్రం మంత్రాలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. ఏకాదశి సందర్భంగా మంత్రాలయ శ్రీ మఠంలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలలో భాగంగా ఉదయాన్నే శ్రీ గురు రాఘవేంద్రుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, సుప్రభాత సేవ నిర్వహించారు. ఏకాదశి రోజున స్వామివారి బృందావనంపై ఎటువంటి కవచాలు, అలంకరణలు లేకుండా భక్తులకు నిజరూప దర్శనం కల్పించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ అరుదైన దృశ్యాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు.ఏకాదశి నియమాల ప్రకారం, ఈ రోజు మఠంలో నిత్య అన్నదానం నిలిపివేస్తారు.స్వామివారి బంగారు రథోత్సవం, వెండి రథోత్సవం వంటి సేవలు రద్దుచేయబడ్డాయి.పరిమళ ప్రసాదం పంపిణీని కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ మూలరాములకు విశేష ఫలపంచామృతాభిషేకాలు, పూజలు మాత్రమే నిర్వహించారు.

# గ్రామీణ చిన్నారులతో బ్యాటింగ్ చేసిన కలెక్టరు

**నంద్యాల, మే 13,ప్రభాతవార్తప్రతినిది :** క్రికెట్ అట అంటే చూడటని అడని వారుండరు దేశ విదేశాలో క్రికెట్ అటకు అంత క్రేజీ ఉంది. అలాంటి అటను ఏకంగా సాక్షాత్తు జిల్లా కలెక్టరు రాజకుమారి చిన్నారులతో కలసి బ్యాటట్ పట్టిన వైనము నంద్యాల మున్సపల్ స్కూలో చోటు చేసుకుంది నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి బుదవారము నంద్యాలలోని మున్సపల్ హైస్కూలు నందు జరుగుతున్న యస్‌యస్‌సి రెమిడియల్ క్లాసులను అకస్మికంగా తనికీ చేశారు. అనంతరము తిరిగి వస్తుండగా స్కూలు గ్రౌండు నందు చిన్నారులక్రికెట్ అడుతుండటము గమనించారు. దీనితో వారితో సరదాగా కాసేపు అమె కూడా బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేశారు. చిన్నారులతో కలిసి అమె చిన్నానాటి జ్ఞాపకాలను నేమరు వేసుకుంటూ అన్ని మరచి కాసేపు వారితో సరదాగా బ్యాటింగ్ చేయడము అందరినీ అలరించింది.క్రికెట్ అంటే ఎంత హోదాఉన్నారికైన మక్కువ ఎక్కువే అనడానికి కలెక్టరు పట్టిన బ్యాటే నిదర్శనము.



# యువకులు క్రీడల్లో రాణించాలి..

**: విజేతలకు బహుమతులు అందజేత..**



**గడివేముల, మే 13, ప్రభాతవార్త ;** యువకులు క్రీడల్లో రాణించాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రమైన గడివేములలో టీడీపీ నాయకులు, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షులు దేశం సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీపేట లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 52 జట్లు పాల్గొన్నాయి. ఇందులో గెలిచిన విజేతలకు బుధవారంనాడు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి చేతులమీదుగా గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు గెలుపొందిన వారికి నిర్వాహకులు, టీడీపీ నాయకులు, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షులు దేశం సత్యనారాయణరెడ్డి, టీడీపీ నాయకులు దేశం సురేందర్‌రెడ్డి, యువ నాయకులు దేశం శివనాగిరెడ్డి సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్నిస్తాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. యువకులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా బాగా కష్టపడి చదివి ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాడు పీవీఎన్ రాజు, బాబునాయక్, సంజీవరెడ్డి, క్రికెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు



**కర్నూలు మున్సిపల్, మే 13, ప్రభాతవార్త:** నగరశివార్లలో టిడ్కో గృహాల్లో అన్నివసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం ఆయన టిడ్కో మునిసిపల్ అధికారులతో కలిసి టిడ్కో గృహాలను పరిశీలించారు. అక్కడి వసతులు సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి అదేశాలు జారీచేశారు. టిడ్కో నిర్మాణాల స్థితిగతులు తాగునీటి సరఫరా పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో వారంలో రెండుసార్లు నీటి సరఫరా చేయడం జరుగుతుందని విద్యుత్ దీపాలకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. రేషన్‌బియ్యం సరఫరా, సచివాలయ బస్సు సౌకర్యం ప్రాథమిక పాఠశాల వంటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈనెలాఖరుకు 500 గృహాలు అందుబాటులోకి వస్తాయని రెండునెల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా పనులు పూర్తి అవుతాయన్నారు. టిడ్కో గృహాలు పొందిన వారు వెంటనే చేరాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, టిడ్కో ఎస్ఈ పివి శేషసాయి, ఎంఈ సూర్యనారాయణ, ఏఈ జనార్థన్, టిడ్కో అధికారులు పెంచలయ్య, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవసరం మేరకు ఎరువులను అందించాలి

**– ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ – ఏఓ జీరా గణేష్**



**మంత్రాలయం, మే 13, ప్రభాతవార్త ;** రైతులకు అవసరం మేరకు ఎరువులను అందించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) జీరా గణేష్ ఎరువుల దుకాణ యజమానులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ దుకాణదారులు అమ్మకాలు చేసిన ఎరువుల యొక్క రైతుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. అలాగే రైతులు భూమి సాగు మేరకు వివరాలు నమోదు చేసుకుని ఎరువులను డీబీటీ పద్ధతి ద్వారా నమోదు చేసుకుని అందించాలన్నారు. అలాగే ఎరువులకు వేరే ఎటువంటి అనుసంధానపు ఉత్పత్తులను రైతులకు అంటగట్టరాదన్నారు. రైతులకు మండలంలో యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు పొందాలని సూచించారు.

# వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**– డైరెక్టర్ కె.నరసప్ప**



**ఆదోనిలీగల్, మే 13, ప్రభాతవార్త ;** వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని నైస్ అకాడమీ (నేతాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నైస్ అకాడమీ డైరెక్టర్ కె.నరసప్ప తెలిపారు. బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ బేసిక్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ అండ్ పేయింటింగ్, పవర్ ప్రజెంటేషన్, బేసిక్ మ్యాథ్స్, ప్లే అండ్ లెర్న్ యాక్టివిటీస్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే శిక్షణ ఇస్తున్నామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థినీ, విద్యార్థులకు ఫీజులో రాయితీలు కల్పిస్తున్నామన్నారు. పేద విద్యార్థులను కూడా దృష్టిలో ఉంచుకుని తమ నేతాజీ అకాడమీ పని చేస్తుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆస్పరి రోడ్డులోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9963703868 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# బాల్య వివాహాలు, మహిళల భద్రత గురించి అవగాహన కార్యక్రమం



**కౌతాళం, మే 13, ప్రభాతవార్త:** కౌతాళం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళలపై నేరాల నివారణ, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ఎం.ఎన్. భార్గవి హాజరై మాట్లాడారు. ప్రతి తల్లిదండ్రులు బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆమె తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల బాలికల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు పిల్లలు ఇష్టపూర్వక చదువులు చదివించి మెరుగైన జీవితం కల్పించాలని కోరారు. కౌతాళం సీఐ యుగంధర్ మాట్లాడుతూ: మహిళలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను సెల్ ఫోన్లకు అతిగా అలవాటు పడనివ్వకుండా మంచి, చెడు విషయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం మహిళలపై నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో బాల్య వివాహాలు, ప్రేమ వివాహాల విషయంలో యువత ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అలాగే సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి తెలుసుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, పంచాయతీ ఇంచార్జ్ సెక్రటరీ యోగేశ్వర్ రెడ్డి, మహిళలు, వెలుగు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

**: వెటర్నరీ డాక్టర్ నాగరాజు**



**డోన్, మే 13, ప్రభాతవార్త :** డోన్ మండలంలోని రైతులు మేలు రకమైన పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు అదేవిధంగా 75 శాతం సబ్సిడీ కింద పశుగ్రాస విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ప్రతి రైతు పొలంలో పది శాతం పశుగ్రాస్ విత్తనాలు వేసుకొని పశు గ్రాస నీ సాగు చేయాలని రైతులకు సూచించారు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లో పశు గ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు వారి ద్వారా తీసుకొని సహకరించాలని డాక్టర్ నాగరాజ్ తెలిపారు ఈ కార్యక్రమంలో రఫీ నవ్య కృష్ణ పాల్గొన్నారు.

# నీట్ యూజీ పేపర్ లీకేజ్‌కి పాల్పడిన కార్పొరేట్ మాఫియాను కఠినంగా శిక్షించాలి

**: ఎన్‌టిఏను రద్దుచేసి రాష్ట్రాలకే వైద్యవిద్య ప్రవేశాలను నిర్వహించుకునే అధికారాన్ని పునరుద్ధరించాలి**

**: కె భాస్కర్ పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు**

**కర్నూలు విద్య, మే 13, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ యూజీ పరీక్ష మరోసారి ప్రశ్నాపత్రం లీక్ అవకతవకల కారణంగా వివాదంలో నిలిచి పరీక్ష రద్దువరకు పరిస్థితి వెళ్లడం కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఏ వైఫల్యానికి నిదర్శనమని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) రాష్ట్ర అధ్యక్షులు కె భాస్కర్ అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని 2024లో కూడ నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర అందోళనకు దారితీశాయన్నారు. 25 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాశారు. వీరందరు భవిష్యత్తుపై అందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకొని పరీక్షలు రాస్తే కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో రద్దుయిపోయింది, విద్యార్థులకు భరోసా ఇవ్వాల్సిన ఎన్‌టిఏ పరీక్షలు మళ్లీ నిర్వహిస్తామని విద్యార్థులు మళ్లి పరీక్ష ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.

# స్కేటింగ్‌లో ఆసక్తిని పెంపొందించుకోవాలి..

**: రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన స్కేటింగ్ క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు..**



**కర్నూలు స్పోర్ట్స్, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు అభినందన కార్యక్రమం జరిగింది కార్యక్రమంనికి ముఖ్య అతిథులుగా మానవత సంస్థ కన్వీనర్ యాని ప్రతాప్, యాపిల్ బోటిక్ సంస్థ అధినేత ప్రణతి రెడ్డి, జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం సీఈఓ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువతలో స్కేటింగ్ క్రీడపై ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్కేటింగ్ ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం అలవడుతుందని పేర్కొన్నారు. కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ సంఘం జిల్లా కార్యదర్శి అబుబాకర్, జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘ సహాయ కార్యదర్శులు పునీతా చౌదరి, అనుషా రెడ్డి, సభ్యులు శ్రవంతి, కోచ్‌లు రేనాల్డ్, సురేష్, పి ఇ టి సురేష్ పలువురు తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో కర్నూలు క్రీడాకారులు రాణించాలి



**కర్నూలు సిటీ, మే 13, ప్రభాతవార్త :** కర్నూలులో క్రీడలు అభివృద్ధి చెందడం ఎంతో సంతోషంగా ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు లో వేసవి శిక్షణ తరగతులు క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 80 శిబిరాలు ఏర్పాటు చేశారు. అవుట్ డోర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు డాక్టర్. శంకర్ శర్మ పౌష్టికాహారం అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కోసం మంత్రి టీజీ. భరత్, మాజీ ఎంపీ టీజీ. వెంకటేష్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వారి కృషి తో పాటు మరికొందరి సహకారంతో కర్నూలు స్పోర్ట్స్ హబ్ గా మారుతుందన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం మాత్రమే క్రీడలు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. విద్యార్థులు మంచి ఆహారంతో పాటు పండ్లు, తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. క్రీడల్లో పాల్గొంటే గెలుపు ఓటములను సమానంగా తీసుకునే మనోధైర్యం అలవాటు అవుతుందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి భూపతి రావు, చిన్న సుంకన్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి..



**మంత్రాలయం టౌన్, మే 13, ప్రభాతవార్త :** మంత్రాలయం మండలంలో వెలుస్తున్న అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని బహుజన సమైక్య సమితి (బి.ఎస్.ఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం మంత్రాలయం తహసీల్దార్ రమాదేవికి బి.ఎస్.ఎస్ రాష్ట్ర కన్వీనర్ కురువ వీరేష్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (అర్ టి ఐ) కింద దరఖాస్తుతో పాటు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.ఎస్.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ మాట్లాడుతూ, మంత్రాలయం నుండి ఎమ్మిగనూరు, మాధవరం, నాగులదిన్నె రహదారుల వెంబడి భారీగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది. ఒక్కో సెంటు రూ. 10 లక్షల నుండి రూ. 20 లక్షల వరకు పలుకుతున్నా, ఈ వెంచర్లకు డిటిసిపి, గ్రామ పంచాయతీ మరియు రెవెన్యూ శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అనే దానిపై ప్రజలకు స్పష్టత లేదు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న హౌస్ సైట్ల పథకం కింద ఎంత భూమి సేకరించారు, లబ్ధిదారుల సంఖ్య ఎంత, మరియు లేఅవుట్లలో కేటాయించిన రోడ్లు, ఓపెన్ స్పేస్ వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. అనుమతులు లేని వెంచర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలు ఆర్థికంగా నష్టపోకుండా పత్రికా ప్రకటనల ద్వారా అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలకలదోలా దేవిపుత్ర, నందవరం మండల అధ్యక్షుడు ప్రభాకర్, మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు కిట్ట నాయకులు, బీమా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# గూడ్సు వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

**– మంత్రాలయం సీఐ దస్తగిరిబాబు**



**మంత్రాలయం, మే 13, ప్రభాతవార్త;** గూడ్సు వాహనాల్లో పలకలను ఏర్పాటు చేసి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని మంత్రాలయం సీఐ దస్తగిరిబాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం జైలు శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. గూడ్సు వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని, పలకలను ఏర్పాటు చేసుకోరాదన్నారు. నిబంధనలను ఉల్లంగిస్తే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలను ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. పలకలను ఏర్పాటు చేసుకున్న నడుపుతున్న గూడ్సు వాహనాల్లో పలకలను సీఐ తొలగించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఏసీబీ వలలో.. అవినీతి చేపలు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** అవినీతి సంపాదనతో అక్రమార్జనకు అలవాటుపడ్డ కొందరు అధికారులు చాకచక్యంగా ప్రజల నుండి డబ్బులు వసూళ్లు చేసుకుంటున్నారు. అలా వసూళ్లకు పాల్పడిన ఇద్దరు అధికారులు ఏసిబి వలలో చిక్కిన సంఘటన ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో చోటు చేసుకుంది." వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించి అవినీతి అధికారుల గుట్టురట్టు చేశారు. ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసిన అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) నరసింహులు, అనధికారిక కంప్యూటర్ ఆపరేటర్ మోహన్‌లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈడిగ రంగన్న గౌడ్ అనే వ్యక్తి తన ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ రెన్యువల్ కోసం కార్యాలయానికి వెళ్లగా, ఆ పని చేసి పెట్టేందుకు ఏఓ నరసింహులు రూ. 35 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ. 30 వేల రూపాయలు ముందుగా ఇస్తానని, మిగిలిన రూ. 5 వేలు పని పూర్తయ్యాక ఇస్తానని బాధితుడు ఒప్పందం చేసుకున్నాడు. అవినీతి అధికారికి లంచం ఇవ్వడం ఇష్టం లేని రంగన్న గౌడ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచన మేరకు బుధవారం సాయంత్రం నగదు అందజేస్తుండగా ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు రాజా ప్రభాకర్, కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బారాయుడు నేతృత్వంలోని బృందం ఆకస్మిక దాడి చేసింది. బాధితుడి నుంచి 30 వేల రూపాయలు తీసుకుంటుండగా నరసింహులును పట్టుకుని సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఉన్న రూ .73,600 రూపాయలను కూడా అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఈ భారీ మొత్తం ఎవరి నుండి వసూలు చేశారనే అంశంపై ఏసీబీ ఆరా తీస్తోంది. కేసు నమోదు చేసిన అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని డీఎస్పీ సోమన్న ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పాలు కరువు.. మద్యం కొలువు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** లేకపోవడం ఆ శాఖ అవినీతికి నిదర్శనంగా కనపడుతుంది ....మద్యం దుకాణం మామూళ్లు .. ఇకపోతే మద్యం దుకాణంలో కానీ ,వారి కనుసన్నలలో నడిచే బెల్టు షాపుల వద్ద కానీ అధికారులు దాడులు చేయకుండా ఆయా పరిధి పాలకులకు ,అధికారులకు ఒక్కో లైసెన్స్ కలిగిన మద్యం వ్యాపారి నెలకు 50 నుండి లక్ష రూపాయల మధ్యన మామూళ్లు ఇస్తున్నట్లు బోగట్టా .. బెల్టు షాపులపై కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిడెంట్ డి .రామకృష్ణ రెడ్డి ను వార్త వివరణ కోరగా లైసెన్సులు కలిగిన దుకాణాలు తప్పితే మరెక్కడా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు .మహిళలు ,ప్రజలకు ఇబ్బంది కలిగేలా బెల్టు షాపులు నిర్వహిస్తే 14405 టోల్ ఫ్రీనకు తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులు చేసిన వారి సమాచారాన్ని గోప్యాంగా ఉంచుతామన్నారు .

# ట్రాఫిక్ ఎస్ఐ సర్వీస్ నుంచి డిస్మిస్

**(మొదటి పేజీ తరువాయి ) :** చివరకు యువతి కుటుంబ సభ్యులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణ జరిపించి డిస్మిస్ చేశారు. కాగా, హరిప్రసాద్ ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐగా పనిచేసే సమయంలో కూడా ఆయనపై అనేక ఆరోపణలు రావడంతో అధికారులు శాఖాప రమైన చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వ్యక్తి ట్రాక్టర్లో ఇసుక తరలిస్తుండగా చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద పట్టుకుని పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ.. సెల్ఫీ వీడియోను మంత్రి లోకేశుకు పంపారు. దీనిని తీవ్రంగా పరిగణించిన డీజీపీ ఎస్పి హరిప్రసాదును సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో డీఐజీ ఆయన్ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ తొల గించిన తర్వాత చిత్తూరు జిల్లాలో కొంతకాలం పనిచేశారు. ఇటీవలే కర్నూలు జిల్లాకు వచ్చిన ఆయన కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

# జనాభా గణాంకాలలో అక్షర దోషాలు లేకుండా నమోదు చేయండి

**: నంద్యాల జిల్లా ఇంచార్జి సెన్సస్ అధికారిని విష్ణు మాధురి..**




**ఆత్మకూరు, మే 13, ప్రభాతవార్త :** బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జనాభా గణన సూపర్వైజర్ లతో సమావేశాని నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జనాభా గణన ను చాలా కచ్చితత్వం తో ఎలాంటి దోషాల్లేకుండా ప్రభుత్వం ఇచ్చిన సమయానికి ముగించాల్సిందిగా తెలియజేశారు. అలాగే ఆత్మకూరు తహశీల్దార్ రత్నా రాధిక మాట్లాడుతూ ఆత్మకూరు రూరల్ కంటే అర్బన్ లో ఎన్యూమరేటర్లు చాలా వెనుకబడి ఉన్నారు అని తెలియజేశారు ప్రభుత్వం ఇచ్చిన సమయానికి గణన చేయకపోతే ఎన్యూమరేటర్లు పైన యాక్షన్ తీసుకోబడును అని తెలియజేశారు. అలాగే డివిజనల్ గణాంక అధికారి నాగరాజు మాట్లాడుతూ పల్లెటూరు ప్రజలు వలస వెళ్లిన వాళ్లను తప్పకుండా ఈ గణన లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సాహెబ్ పీర్, టీపీవో రామకృష్ణా, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పది పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలింపు..

**: ఇంటి నుండి పారిపోయిన విద్యార్థి మోదిన్..**

**: ఆలూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు..**




**ఆలూరు, మే 13, ప్రభాతవార్త :** పది పరీక్షలలో అతి తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో విరక్తి చెందిన మోదిన్ అనే పదో తరగతి విద్యార్థి ఇంటి నుండి పరారైన (అదృశ్యం) సంఘటన చోటు చేసుకుంది. ఆలూరు పోలీసులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు హోలేబీడు గ్రామానికి చెందిన బోయ షేకన్న, జయమ్మ దంపతుల కుమారుడు మోదిన్ స్థానిక ప్రభుత్వ పాఠశాల నందు పదవ తరగతి చదువుతూ ఇటీవల పరీక్షలు రాశారు. గత కొద్ది రోజుల క్రితం పదవ తరగతి ఫలితాలు విద్యాశాఖ విడుదల చేసింది. ఆ ఫలితాలలో మోదిన్ 260 మార్కులతో పాసయ్యారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఇంత తక్కువ మార్కులతో పాస్ కావడం ఏమిటి అంటూ కుమారుడు మోదిన్ పై ఆగ్రహ వ్యక్తం చేస్తూ తీవ్రంగా మందలించారు. దీంతో తల్లిదండ్రుల మందలింపు నచ్చని విరక్తి చెందిన విద్యార్థి మోదిన్ తమ ఇంటి నుండి ఈనెల 10వ తేదీ ఎవరికి చెప్పపెట్టకుండా వెళ్లిపోయాడు. మోదిన్ ఆచూకీ కోసం గత రెండు రోజులుగా బంధువులు ఇళ్లల్లోనూ, చుట్టుపక్క ప్రాంతాలలో వెతికినా విద్యార్థి ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక ఆలూరు పోలీస్ స్టేషన్ నందు తల్లిదండ్రులు తమ కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9100565177 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# కడివెళ్ళలో ఘనంగా నూతన నవగ్రహ, నాగదేవత విగ్రహ ప్రతిష్ట

**: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్ మురహరి రెడ్డి**



**ఎమ్మిగనూరు టౌన్, మే 13, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కడివెళ్ల గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నూతన నవగ్రహ ప్రతిష్ట మరియు నాగదేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్సిపి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్ మురహరి రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో జరిగిన హోమాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని శ్రీ సీతారామాంజనేయ స్వామివారిని ప్రార్థించారు. దేవాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ప్రతిష్టాపన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యేక అలంకరణలతో దేవాలయం కళకళలాడగా, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ దేవాలయంలో నవగ్రహాలు, నాగదేవత విగ్రహాల ప్రతిష్ట జరగడం ఎంతో శుభపరిణామమని, గ్రామానికి ఆధ్యాత్మిక శోభ మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ కోటకొండ రంగస్వామి, మల్లారెడ్డి, కిరణ్ కుమార్, మాల పెద్దయ్య పరమేష్, సూర్య, రమేష్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలకు..దేవాలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయి : ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి..

: భక్తిశ్రద్దల నడుమ పెండేకంటి ఆంజినేయస్వామి దేవాలయ పున: ప్రతిష్టాపన..



**కోసిగి, మే 13, ప్రభాతవార్త :** హిందూ సంస్కృతి సంప్రదాయాలకు ఆధ్యాత్మిక శోభకు దేవాలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని మంత్రాలయం నియోజక వర్గ ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి అన్నారు..బుధవారం మండల కేంద్రమైన కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలో, మౌంట్‌కార్మెల్ పాఠశాల వెనక వైపు గ్రామ ప్రజల సౌజన్యంతో ఎంపిపి పెండేకంటి లవకుశ ఈరన్న ఆధ్వర్యంలో పెండేకంటి ఆంజినేయస్వామి ఆలయ పున: ప్రతిష్టష్టాపన కార్యక్రమం జరిగింది.. ఈ దేవాలయ నూతన ప్రారంభోత్సవంలో ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి జిల్లా వైకాపా నాయకులు మురళీమోహన్‌రెడ్డిలు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా గత మూడు రోజుల పాటు హోమం నిర్వహించి నవగ్రహ పూజలు, ధ్వజ స్థంబం ప్రతిష్ట ఏర్పాటు చేసారు.. దీంతో బుధవారం పెండేకంటి ఆంజినేయస్వామి వారి విగ్రహాని భక్తిశ్రద్దలతో ప్రతిష్టాపన చేపట్టారు.. ఈ సందర్భంగా పూజలకు హాజరైన ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ, సమాజంలో, ప్రజలలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందిం చడంతో పాటు, ధర్మ పరిరక్షణకు స్వామి భక్తికి సాటిలేదని నిరూపించిన ఆంజినేయ స్వామి పూజ్యనీయుడన్నారు..ముఖ్యంగా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఆలయాలు అనేవి కేంద్ర బిందువులుగా నిలుస్తాయన్నారు.. ఆలయం అనేది కేవలం పూజలు జరిగే స్థలం మాత్రమే కాదని, అది ధర్మం, భక్తి, ఆదర్శ జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు.. అలాంటి పెండేకంటి ఆంజినేయస్వామి వారి ఆలయ ప్రతిష్ట ఈ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక వెలుగును ప్రసాదించిందన్నారు.. ఈ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, యువత అలాగే ప్రతి భక్తుడికి హృదయపూర్వక అభినందనాలు అన్నారు..అందరి సహకారంతో ఈ దైవ కార్యం విజయవంతం కావడం ఎంతో సంతోషకరమన్నారు.. సమాజంలో ఐక్యత, శాంతి సోదర భావం పెరగాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని పెండేకంటి ఆంజినేయస్వామి వారిని ప్రార్థిస్తున్నానన్నారు. మరీ ముఖ్యంగా ఈ ఆలయం భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.. పూజలకు హాజరైన ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డిలను ఆలయ సభ్యులు ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో ఎంపిపి పెండేకంటి ఈరన్న, సీనియర్ నాయకులు నాడుగేని నరసింహులు, మాజీ ఎంపిపి భీమక్క, మంగమ్మ, నాడుగేని నాగరాజు, దొడ్డి నరసన్న, జంపాపురం చూడి బసిరెడ్డి, లోకారెడ్డి, వెంకటేశ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు..



# ఏపీ సమగ్రశిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి




**హొళగుంద, మే 13, ప్రభాతవార్త;** ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ-1 సుధారాణి, ఎంఈఓ-2కబీర్‌సాబ్‌లకు సీఆర్‌పీ పంపాపతి, సాయిబేష్‌లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం, హామీల అమలు కాకపోవడం, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమగ్రశిక్షా, కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. హెల్త్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. మినిమం టైం స్కేల్, డీఏ, హెచ్‌ఆర్ఏ అమలు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలన్నారు. గ్రాట్యుటీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవులు మంజూరు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాపాదయాత్రకు సంబంధించి హొళగుంద మండల విద్యాశాఖ అధికారులకు ముందస్తు నోటీసును ఇవ్వడం జరిగిందన్నారు.

# అప్పుల భారంతో వ్యక్తి ఆత్మహత్య..

: కేసు నమోదు..



**కోసిగి, మే 13, ప్రభాతవార్త :** కోసిగి లోని కొండనగేరి వీధికి చెందిన మంగలి అశోక్(32) అనే వ్యక్తి అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు..ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మంగలి అశోక్ గత ఏప్రిల్ నెల 24వ తేదిన ఆర్టీసి బస్టాండ్ సమీపంలో పురుగుల మందు సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్సులో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు..కాగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేది సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు..మృతుడి భార్య తెలిపిన సమాచారం ప్రకారం మృతుడికి ఒక కుమార్తె ఉండగా ఆమె పుట్టుకతోనే వికలాంగురాలు కావడంతో కుమార్తె చికిత్స కోసం అప్పులు చేయాల్సి వచ్చిందన్నారు..అంతేకాక అనారోగ్య సమస్యలతో కుమార్తె గత పది నెలల క్రితం మరణించడంతో దీనిని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురై మద్యం సేవించడం అలవాటు చేసుకున్నాడన్నారు.. చేసిన అప్పులు తీర్చలేక ఆర్థిక భారంతో బాధ పడుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు..ఈ మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..

# శ్రీ అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే..

**పత్తికొండ, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జూటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం సంధర్భంగా పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతు శ్రీఅభయాంజనేయస్వామి ఆశిస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కోరుకున్నట్లు తెలిపారు. అలాగే సకాలంలో వర్షాలు కురిసి రైతన్నల పంటలు భాగాపండాలని, గ్రామాల్లో శాంతి సౌభ్రాత్వత్వాలు నెలకొనాలని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈ-కేవైసి పూర్తి చేయకుంటే సబ్సిడి కట్



**నంద్యాల హాస్పటల్, మే 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులకు ఈ-కేవైసి ని తప్పని సరి చేస్తూ కీలకమైన మార్గదర్శకాలను విడుదల చేసినట్లు ఎజెన్సీ నిర్వాహకులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ వినియోగదారులు తమ సబ్సిడిని నిరంతరాయంగా పొందాలంటే ప్రతి ఏటా ఈకేవైసి ప్రక్రియను పూర్తి చేయడం తప్పని సరి అని వారు తెలిపారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రతి యేటా మే నెలలో దీనిపై అధికారులు ప్రత్యేక చర్య తీసుకుంటారు. వినియోగదారులు తమ అధార్ వివరాలను గ్యాస్ కనెక్షన్‌తో దృవీకరించుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో ప్రభుత్వం అందించే సబ్సిడి నిలిచిపోయే పరిస్ధితులు ఉంటాయని వారు తెలిపారు. ఈ కేవైసి ని మొబైల్ యాప్ ద్వారా, గ్యాస్ ఎజెన్సి వద్ద, డెలివరీ బాయ్ వద్దగాని ఈ కేవైసి చేసుకోవచ్చునని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరంలేదని, మార్చి లేదా మే నెల తరువాత వచ్చే సబ్సిడి జమ కాకకపోవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

# జనగణనలో తప్పులకు తావుండకూడదు - తహాసిల్దార్ రవి..



**తుగ్గలి,మే 13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెండేకల్లు రెవిన్యూ గ్రామం రాంకొండ గ్రామాలలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను బుదవారం మండల చార్జ్ ఆఫీసర్ మరియు తహాసిల్దార్ రవి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. జనగణనలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన మార్గ దర్వకాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యూమలేటర్లు ఆడిగే వివరాలను ప్రజలు కచ్చితంగా తెలిపి ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. రికార్డులలో ఎలాంటి తప్పులు దొర్లినా భాధ్యులపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నహోతూరు లో ప్రజల దాహార్తిని తీర్చేందుకే వాటర్ ప్లాంట్



**ఆస్పరి,మే 13,ప్రభాతవార్త:** చిన్నహోతూరు గ్రామంలో నోలకొన్న తాగునీటి సమస్యను తీర్చేందుకే వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని ఎంపిడివో గీతావాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామంలో శ్రీ సిద్దారామేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపిడివో గీతావాణి, పి.ఎస్.జె.సిద్దులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు 2019లో గ్రామానికి చెందిన నాయకుడు కీ.శే.పొన్నే కుమార్‌నాయుడు, మాజీ ఎం.పి. బుట్టా రేణుక, రాజ్యసభ సభ్యుడు టి.జి.వెంకటేష్ నిధుల ద్వారా బోర్ వేయించి పైపులైన్ కనెక్షన్ ఇప్పించి మినరల్ వాటర్ ప్లాంట్‌ను పూర్తి చేసి గ్రామ పంచాయితీకి అప్పగించడం జరిగిందన్నారు. అయితే వాటర్ ప్లాంట్ ఉపయోగంలోకి రాలేదన్నారు. ప్రస్తుతం అలూరు టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి, డిపివో బాస్కర్ సహాకారంతో వాటర్ ప్లాంట్ కు మరమ్మత్తులు చేయించి గ్రామంలో ఉన్న నీటి సమస్య ను పరిష్కారించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వరదరాజులు, పంచాయితీ కార్యదర్శి రాము, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

- పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తా.. - మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి..



**ఆదోనిలీగల్, మే 13, ప్రభాతవార్త;** మండలంలోని బసరకోడు గ్రామానికి చెందిన యం.ఈరమ్మ, యం.నరసన్న దంపతుల కుమారుడి వివాహానికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బుధవారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక స్వగృహంలో యం.ఈరమ్మ, యం.నరసన్న దంపతులు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆర్థికంగా రాణించాలని, వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అలాగే మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన గుండమ్మ, ముకప్ప కుమార్తె వివాహానికి కూడా మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు.

# కలెక్టరేట్‌లో బ్యాంబూసెల్ కౌంటరు నిర్మాణమునకుభూమి పూజ



**నంద్యాల, మే 13, ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల కలెక్టర్లు కార్యాలయంలో స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృతమైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా జిల్లా యంత్రాంగము చర్యలు చేపడుతుందని కలెక్టరు రాజకుమారి తెలిపారు. బుదవారము కలెక్టరేట్ ప్రాంగణములో వెదురు (బ్యాంబూ)తో నిర్మించనున్న వినూత్న సెల్ కౌంటరుకు కలెక్టరు భూమి పూజ చేశారు

# పరిశ్రమల అబివృద్ధికి ప్రత్యేక చర్యలు



**నంద్యాల, మే 13, ప్రభాతవార్తప్రతినిధి :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికాబివృద్ధి కి అనుకూల వాతావరణము కల్పించాలని జిల్లా కలెక్టరు రాజకుమారి సంబందిత అదికారులను అదేశించారు. బుదవరాము కలెక్టరేట్లఓని వీడియెయో కాన్ఫరెన్సు హాలుల్లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటి సమావేశముతో పాటు స్కిల్ డెవలప్‌మెంటు ఉపాది కల్పన వివిద సర్వేల పురోగతిపై సమీక్ష సమావేశము నిర్వహించారు.ఈ సమావేశములో జిల్లా పరిశ్రమల మేనేజరుతదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండలో ఘనంగా బడి పిలుస్తోంది.. భవిషత్తు పిలుస్తోంది..

**పత్తికొండ, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా బడి బయట ఉన్న పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం మరియు ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బాలబాలికను ఒకటవ తరగతిలో చేర్పించడమే లక్ష్యంలో భాగంగా బుధవారం పట్టణంలో ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. మే 1వ తేదీ నుండి ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.సుధాకర్ బడి పిలుస్తుంది కో-ఆర్డీనేటర్ సురేంద్ర బాపూజి, ఎంపిడిఓ కవిత, ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతు జిల్లాలో బడి ఈడు పిల్లల సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికంగా ఉందని తెలిపారు. 2025-26విద్యా సంవత్సరానికి జిల్లాలో మొత్తం 2,81,000 మంది విద్యార్థులు నమోదు చేయాలనే లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే యుడిఐఎస్‌ఎఫ్ ప్లస్‌లో 2,35,000 మంది నమోదు కావడం హర్షణీయమన్నారు. ప్రతి విద్యార్థి ఎడిఐఎస్‌ఈలో నమోదు అయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖలోని ప్రతి ఒక్కరు భాగస్వాములైతే ఈ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను 100 శాతం విజయవంతం చేయగలమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలతి, శ్రీదేవి, ఉపేంద్ర, నరేంద్ర, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# స్వచ్ఛ పథకం తో పరిశుభ్రతను పాటించాలి




**ఆస్పరి, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ పథకం ద్వారా గ్రామంలో పరిశుభ్రతను పాటించాలని ఎంపిడివో గీతావాణి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఆస్పరిలో స్వచ్ఛ పథకం కార్య క్రమాన్ని ఈఓఆర్డీ విజయ్‌బాను ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొని పట్టణంలోని ప్రధాన వీధులలో శుభ్రపరుస్తూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోవిందప్ప, మాజీ సోసైటి డైరెక్టర్ కృష్ణయాదవ్ మాట్లాడుతు స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి బాటలు వేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, గ్రామం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక భాధ్యత అని వారు తెలిపారు. స్వచ్ఛతే సేవ ప్రజల ఆరోగ్యమే లక్ష్యమన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ అరవింద్, ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ సుదర్శన్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ సంజన్న, మల్లికార్జున, నాయకులు సోమలింగప్ప యాదవ్, ఎండ్రీ శ్రీనువాసులు, తిమ్మన్న, యూత్ కన్వీనర్ రాఘవేంద్ర, శేషిరెడ్డి, బిల్లేకల్ కృష్ణ, రామలింగప్ప, మేకల రంగనాథ్, మహేష్, హంపయ్య, రవి, చాపల మహానంది, తెవుల గోపాల్, పూజారి శ్రీనువాసులు, పూజారి శివ, డి.ఆంజనేయ, నర్సప్ప, సింగారయ్య, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించండి

- ఎంఈఓలు సుధారాణి, కబీర్‌సాబ్



**హొళగుంద, మే 13, ప్రభాతవార్త;** తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈఓ-1 సుధారాణి, ఎంఈఓ-2 కబీర్‌సాబ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కోగిలతోట గ్రామంలో బడి పిలుస్తోంది-ప్రభుత్వ బడి పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, దుస్తులు, పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్చరిక బోర్డు పెట్టినా..ఫలితం శూన్యం..!

- లోపించిన పారిశుద్యం




**మద్దికెర, మే 13, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన మద్దికెరలోని పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో పారిశుద్ధ్యం లోపం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుంది. పంచాయతీ అధికారులు పజ్రాధనంతో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్త వెయ్యకూడదు.. వేసిన వారికి రూ.2 వేలు జరిమానా విధించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు కూడా పెట్టారు. ప్రజలకు అవగాహన కల్పించకుండా ప్రజాధనంతో బోర్డులు పెట్టడం ఎంతవరకు సమంజసం, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలోనే ఇలా ఉంటే ఊరుబయట ఎలా ఉంటుందో మనకు ఇప్పటికే అర్థమై ఉంటుంది. ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను, కుళాయి పన్ను కట్టించుకున్న వాటిపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై అధికారులకు లేకపోవడంతో ప్రజలు పలు రకాలుగా ప్రశ్నిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు

- డీఈఓ సుధాకర్



**మద్దికెర, మే 13, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన మద్దికెరలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సుధాకర్ బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా డీఈఓ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు రావడం జరుగుతుందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు. పదో తరగతి ఫలితాల్లో 80 శాతంకు పైగా మంచి ఫలితాలను మండలంలోని విద్యార్థులు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఉచిత సౌకర్యాలను కల్పిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు ఆసక్తి చూపేలా మండలంలో ఉన్న ఉపాధ్యాయులు పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మండలకేంద్రంలోని బాలికల పాఠశాలలో పదిలో ఉత్తమ మార్కులు సాధించిన సౌమ్యను డీఈఓ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగస్వామి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహార్‌ను కలిసిన దళిత నాయకులు




**నందికొట్కూరు, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహార్ బుదవారం నందికొట్కూరు కు వచ్చిన సంధర్భంగా స్తానిక దళిత సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసిశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళీలు అర్పించారు. అనంతరం చైర్మన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దళితులు ఎదుర్కోంటున్న సమస్యలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థపై సామాన్య ప్రజల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి

**కర్నూలు అర్బన్ 13 ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నంద్యాల జిల్లాలో ఆలూరులో మరణ హోమం సృష్టించారు అప్పటినుండి ఇప్పటివరకు దౌర్జన్యాలతో, దాడులతో కూటమి నాయకులు విరుచుకుపడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ మరియు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో "రెడ్ బుక్ రాజ్యాంగం" అమలు చేస్తూ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి పోలీసుల ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ యువజన విభాగం సిటీ ప్రెసిడెంట్ బాలు పై పోలీసులు అన్యాయంగా వేధింపులు పెంచారని, కూటమి నేతల ఒత్తిడితో సారాయి కేసు నమోదు చేశారని మండిపడ్డారు. కేసులు లేకపోయినా వైఎస్ఆర్సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తూ అక్రమంగా కేసులు



నమోదు చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా, కర్నూలు నగరంలోని 10వ వార్డు మాజీ కార్పొరేటర్ కార్యాలయంపై టిడిపి నేతలు దాడి చేసి, తిరిగి మాజీ కార్పొరేటర్ యూనిస్‌పైనే కేసు నమోదు చేశారని తెలిపారు. ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ వేధింపులతో సతీష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నప్పటికీ, సూసైడ్ నోట్‌లో పేరు ఉన్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన వారిపై కూడా కేసులు నమోదు చేయడం దారుణమని అన్నారు. నారా లోకేష్ రాజ్యాంగాన్ని కర్నూలులో అమలు చేస్తూ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ విధమైన చర్యలతో పోలీస్ వ్యవస్థపై సామాన్య ప్రజల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్సీపీ యువజన విభాగం సిటీ ప్రెసిడెంట్ బాలు పై పోలీసుల వేధింపులను నిరసిస్తూ రేపు కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్ఆర్సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తో పాటు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీకు పకడ్బందీ ఏర్పాట్లు

**: మే 21 నుంచి జూన్ 4 వరకు 57 కేంద్రాల్లో పరీక్షల నిర్వహన**



**కర్నూలు, మే 13, ప్రభాతవార్త :**
జిల్లాలో మే 21వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను 57 కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. జిల్లాలో తొలి సంవత్సరం పరీక్షలకు 15,835 మంది జనరల్, 1,815 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 17,650 మంది హాజరవుతుండగా, ద్వితీయ సంవత్సరానికి 7,374 మంది జనరల్, 775 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి 8,149 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నపత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో భద్రపరిచి, ఎస్కార్ట్‌తో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, పరీక్షల అనంతరం పోస్టాఫీసులకు భద్రంగా పంపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాల మూసివేత వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు, పారిశుద్ధం కల్పించాలని, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అదనపు బస్సులు నడపాలని సూచించారు. వైద్యశాఖ అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, ఆర్ఐఓ లాలప్ప, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జాయింట్ కలెక్టరుగా సూరజ్ ధనుజయ్

**నంద్యాల, మే 13,ప్రభాతవార్త ప్రతినిధి :**



నంద్యాల జిల్లా జాయింట్ కలక్టరుగా సూరజ్ ధనుజయ్‌ని నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వుఉ జారీ చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పని చేసిన కార్తిక్‌ను ప్రభుతక్వం బదలీ చేసింది అయన స్థానములో సూరజ్ ధనుజయ్‌ను నియిమిస్తు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## మహిళలు సైబరు నేరాలపై అవగామణ కలిగిఉండాలి



**నంద్యాల,క్రైమ్, మే 13,ప్రభాతవార్త :**
మహిళలు యుక్తవయస్సు బాలికలు సైబరు నేరాలు, రోడ్డు ప్రమదాలు పోక్సు చట్టాలపై అవగామణ కలిగి ఉండాలని పాణ్యం సిఐ కిరన్‌కుమారరెడ్డి చెప్పారు. జిల్లా యస్‌పి అదేశాల మేరకు పాణ్యం పోలీసు స్టేషన్ పరదిలోని నెరవాడ గ్రామంలో గల ఎపి గాఇరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నందు ఉమన్ చైల్డుసేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమంలో బాగంగా ప్రత్యేక అగామణ సదస్సు నిర్వహించారు. ఈసదర్బముగా వారుసిఐ,యస్ఐలు మాట్లాడుతూ సోషియల్ మీడియా పట్ల అప్రమత్తగా ఉండాలని గర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిత సమాచరాము పంచుకోవద్దని విద్యారుథ్థలకు సూచించారు. సైబరు మోసాలకు గురైతే 193 నవంబరుకు కాల్ చేసి కానీ స్థానిక పోలీసును కానీ లేదా జిల్లా హెడ్ క్వాటరు నందు గల సైబరు క్రైమ్ కార్యాలయంనందు ఇస్పెక్టర్లను సంప్రదించాలని సూచించారు.

## నేడు ప్రజాసమస్య పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోవాలి

– ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

**ఆళ్లగడ్డ, మే 13, ప్రభాతవార్తః**



ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అదేశాల మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధ్వర్యంలో ప్రజల సమస్య లను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ఆళ్లగడ్డ నియోజకవర్గం వేదిక అవుతుందని అలాగే ఈనాలుగు శుక్రవారాల పాటు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్వయంగా ఆళ్లగడ్డలో పర్యటించనున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. బుధవరం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే శుక్రవారం నుండి వరుసగా నాలుగువారాల పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈభారీ గ్రీవెన్స్ (ప్రజాఫిర్యాదుల) కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కలెక్టర్ నియోజకవర్గంలోనే ఉండి ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రజల తమ దీర్ఘకాలిక సమస్యలు, భూ సబంధిత వివాదాలు పెన్షన్లు, లేదా పౌర సేవలకు సంబంధించిన సమస్యలపై నేరుగా జిల్లా అత్యున్నత అధికారికే ఫిర్యాదుచేసే అవకాశం కల్పించామన్నారు. ఈగ్రీవెన్స్‌లో రెవిన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, మండలస్థాయి అధికారులతో పాటు అన్నిశాఖల అదికారులు పాల్గొంటారని తద్వారా ధరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి విలైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ప్రజలు తమ సమస్యల కోసం జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా పాలనను మీ ముంగింటకే తెస్తున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.25,116

**బనగానపల్లె, మే 13 ప్రభాతవార్త:**
మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి అనంతపురం వాసులు మద్వరాజు శేషగిరి రావు గారి కుటుంబం ఆలయ అభివృద్ధి కోసం రూ.25,116/ విరాళాన్ని అందజేశారు. శేషగిరి రావు గారి కుమార్తె మద్వరాజు పద్మశ్రీ గారు ఈ విరాళాన్ని ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేద పండితులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



# మాయమాటలతో మోసపోయాం..

**: మోసగాడిని పట్టుకొని మా డబ్బు మాకు ఇప్పించండి..**
**: కంతులు కట్టే పరిస్థితిలో మేము లేము..**






**వెల్దుర్తి,మే 13, ప్రభాతవార్త :**
తమ గ్రామానికి చెందిన శాంతకుమార్ అనే వ్యక్తి చెప్పిన మాయమాటలను నమ్మి మోసపోయామని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన హౌసింగ్ రుణాల బాధితులు బోరున విలపిస్తున్నారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీ కుటుంబాల వారైనా పాండురంగడు, మానికింది రామానాయుడు, రామకృష్ణ, రాజు, గోరంట్ల మనోహార్, చిన్న అయ్యన్న, మంజుల, సూర మాదన్న, మాధవస్వామి, రంగమ్మ, రామచంద్ర, లక్ష్మీదేవిలు బుధవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ శాంత కుమార్ మాటలు విని తాము మోసపో యామని ఆవేదన వ్యక్తం చేశారు. మోసగాడిని పట్టుకొని మా డబ్బు మాకు ఇప్పించండి... రంగమ్మ, మల్లేపల్లి గ్రామం వెల్దుర్తి మండలం.. రంగమ్మ తన కుమారుడు నాగేంద్ర పేరు మీద ఇల్లు తాకట్టుపై ఫైవ్ స్టార్ హౌసింగ్ ఫైనాన్స్ లో రూ.4.50 లక్షలు తీసుకున్నాము. అందులో సగం నగదును శాంత కుమార్ తమ వద్ద తీసుకున్నాడన్నారు. మోసగాడిని పట్టుకొని తమ డబ్బులు తమకు ఇప్పించాలని ఆమె వేడుకుంటున్నారు. కంతులు కట్టే పరిస్థితిలో మేము లేము... రామకృష్ణ,మల్లేపల్లి.. తమ కొడుకు కోడలు పేరు మీద ఫైవ్ స్టార్ ఫైనాన్స్లో రూ. 3 లక్షలు మంజూరు కాగా తమ చేతికి 50 వేలు మాత్రమే ఇచ్చాడని కంతులు కట్టాల్సిన పనిలేదు అంతా తను చూసుకుంటానని నమ్మించారని కూలికి పోయి పని చేసుకునే వాళ్ళం కంతులు కట్టే పరిస్థితిలో తాములేమన్నారు. మాకు ఆత్మహత్యలు శరణ్యం అ అంటున్న రామచంద్ర, మల్లెపల్లి.. తమ గ్రామానికి చెందిన శాంత కుమార్ మాటలు నమ్మి తన ఇంటి పై ఫైవ్ స్టార్ ఫైనాన్స్లో రూ మూడు లక్షలు రుణం తీసుకున్నానని అయితే తనకు తిరిగిస్తానని చెప్పి ఫైనాన్స్ కంపెనీ అధికారులకు ఇవ్వాలని నమ్మించి ఒక్క రూపాయి సైతం తమకు ఇవ్వలేదన్నారు. ఫైనాన్స్ కంపెనీ వారి ఒత్తిడి వల్ల తాను కష్టం చేసిన డబ్బును మరికొంత బయట తీసుకొని వచ్చి ఇటీవల రెండు కంతులు కట్టానని ఇలాగే వేధిస్తే తమ కుటుంబం అంతా కలిసి ఆత్మహత్య చేసుకుంటా మన్నారు... వచ్చిన రుణంలో సగం మీకు సగం నాకు అని నమ్మించాడు. పాండురంగడు.. తన ఇంటిపై వెరిటాస్ హౌసింగ్ ఫైనాన్స్లో శాంత కుమార్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి రూ.5 లక్షలు మంజూరు చేయించి తన అకౌంట్లో రూ.4.80 లక్షలు జమ కాగా అతను తన వద్ద నుంచి రూము 3 లక్షలు తీసుకున్నాడని, అవసరం ఉందని అధిక వడ్డీ ఇస్తామని మరో రెండు లక్షలు తీసుకున్నాడు అన్నారు. మీరు ఎటువంటి రుణం చెల్లించాల్సిన అవసరం లేదు కంపెనీ మొత్తం కట్టేస్తుందని నమ్మించాడు. కొద్ది నెలలు మాత్రం తన అకౌంట్ కి డబ్బులు పంపి ఫైనాన్స్ కంపెనీ వారికి కట్టించాడు అయితే గత రెండు నెలల కింద నుంచి కంతులు కట్టకుండా పొంతన లేని సమాధానాలు చెప్పి తమను మోసం చేశాడు అన్నారు. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ వారు మీరు రుణం తీసుకున్నారు మీరు కట్టకపోతే మీ ఇళ్లకు తాళాలు వేస్తామని వేధింపులకు గురి చేస్తూ బెదిరింపులు చేస్తున్నారన్నారు ఇలాగైతే తమకు ఆత్మహత్యలు శరణ్యమని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో రైతు కుటుంబాల రైతు కూలీ కుటుంబాల వారు ఫైవ్ స్టార్, ఆప్టస్, చోళ, వెరిటాస్ హౌసింగ్ ఫైనాన్స్ లో రుణాలు తీసుకున్నామన్నారు. రూ 200, రూ 300 కూలీలతో బతికే తాము వేలాది రూపాయల ఫైనాన్స్ కంపెనీలకు ప్రతినెల చెల్లించలేమని తమను మోసం చేసిన శాంతకుమార్ ను పట్టుకొని తమ నగదు తమకు ఇప్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. చివరకు తమకు ఆత్మహత్యలు శరణమని వారు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ విషయంపై వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఇందుకు ఎస్సై తమతో మాట్లాడుతూ విచారణ చేసి శాంత కుమార్ ను త్వరలో పట్టుకుంటామని తెలిపారన్నారు. తమ ఒక్క గ్రామంలోని 50 కి పైగా గృహాలు తాకట్టుపెట్టి తీసుకున్నామని దాదాపు రూ.1కోటి కి పైగా నగదును మావద్ద శాంత కుమార్ అనే వ్యక్తి తీసుకున్నాడని వారు వివరించారు. కంపెనీ వాళ్ళే కట్టుకుంటారు మీరు భయపడవద్దు మీకు నేనున్నానని నమ్మించాడన్నారు. ఇతను వెల్దుర్తి మండలంలోని మల్లేపల్లి బుక్కాపురం చెరుకులపాడు రామళ్లకోట, క్రిష్ణగిరి మండలం గోకులపాడు లో, కోడుమూరు మండలం గోరంట్లలో సైతం ఇలా మీద రుణాలు ఇప్పించి సగం మీకు సగం మాకు అనే పద్ధతి చేసుకున్నట్లు తెలిసింది. కోడుమూరు మండలం వారికి ఉప్పంద పత్రం స్టాంపు పై రాయించి ఇచ్చినట్లు బాధితులు ఆధారాలు చూపుతున్నారు. మల్లెపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ మాకు అన్యాయం జరిగితే కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## ఖజానాను కాజేస్తున్న రిజిస్ట్రార్‌ను తొలగించాలి

**–విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్‌కు వినతి**

**కర్నూలు విద్య, మే 13, ప్రభాతవార్తః**
రాయలసీమ యూనివర్శిటి ఖజానాను కాజేస్తున్న రిజిస్ట్రార్‌ను తొలగించాలని, యూనివర్శిటి జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వర్శిటికి న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ శరత్ కుమార్ పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె రమణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్‌లు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్శిటి అవినీతికి అడ్డాగా మారిందని అవేదన వ్యక్తం చేశారు. పరిపాలన పేరుతో వర్శిటికి వచ్చిన రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రతిపనికి వాటా అంటూ ప్రభుత్వం వర్శిటికి కేటాయించిన నిధులు దుర్వినియోగం చేస్తు వాటిని సొంత ఖాతాలకు మళ్లించుకుంటూ ధనార్జానే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్శిటిలో జరుగుతున్న పరిణామాలను, పరిస్థితులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి టీజీని కోరారు. ఈవిషయంపై మంత్రి సానుకూలంగా స్పందిస్తు యూనివరి ్శటిలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ శాఖతో సమగ్రంగా విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారని వారు తెలిపారు.




## 10వ తరగతి రెమిడియల్ క్లాసులను ఆకస్మికంగా తనికీ చేసిన కలెక్టరు

**నంద్యాల, మే 13,ప్రభాతవార్తప్రతినిధి :**
పదవ తరగతి సప్లమెంటరీ పరిఓలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాదించేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమన్వయముతో శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టరు రాజకుమారిసూచించారు. బుదవారము నంద్యాల పట్టణంలోని గుర్పాలపేటో ఉనక్న కెయస్‌యం మున్సుపల్ హైస్కూలు లో నిర్వహిస్తునన్న యస్‌యస్‌సి రెమిడియల్ క్లాసు లను జిల్లా కలెక్టరు అకస్మికంగా తనికీ చేశారు. ఈసందర్భముగా ప్రత్యేక తరగతుల నిర్వహణ విదానము విద్యార్థుల హాజరు బోదన పద్ధత్తులను పరిశీలించారు. అనంతరము విద్యార్థులతో ముచ్చటించి వారి చదువులు పురోగతి సబ్జెక్టులవారిగా ఎదురవుతున్న సమస్యలపై అరా తీశారు. పదవ తరగతిలో ఫేయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో అత్మవిశ్వాసమును పెంపొందించేలా బోదన చేయాలని పాఠశాల ప్రిన్సుపల్ మరియు ఉపాధ్యాయులను అదేశించారు. ముఖ్యంగా తెలుగు



మరియు సైన్సు సబ్జెక్టుల్లో శిక్షణ అందించాలని కలెక్టరు సూచించారు. ఈసందర్భముగా కలిసిన మీడియాతో కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి పలితాల్లో 84వాతము ఉత్తీర్ణత నమోదైందన్నారు. అయితే 3375 మంది విద్యార్తులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాదించలుదని తెలిపారు. వీరిలో కొంత మందిఅన్ని సబ్జెక్టుల్లోను ఫేయిల్ కావడం అందోళన కరమన్నారు. అలింటి విద్యార్థులు కూడా సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి జిల్లాయంత్రాంగము ప్రత్యేక కాంర్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతి రోజూ ఉదయం 8గంటల నుండి మద్యహ్నాము 12గంటల వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహినట్లు కలెక్టరు తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి వారికి అవసరమైన విదముగా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రర్దతో బోదిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని కలెక్టరు కోరారు. సప్లమెంటరీ పరీక్షలు పూర్తియ్యే వరకు విద్యార్థులను సెల్‌పోన్‌లు టీవీలకు దూరంగా ఉంచి ఇంటి పనులుచెప్పకుండా చదువుకు అనుకూల వతావరణము కల్పించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు భవిషత్తుకు కీలకమైన పలుపు అని ఈఅవకాశాన్ని సద్వినియోగము చేసుకెఉని మంచి పలితాలు సాదించేలా ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు. విద్యార్థుల భవిషత్తు దృష్ట్యా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యాశాఖ అదికారులు సమన్వయముతో పనిచేస్తే జిల్లాలో మెరుగైన పలితాలు సాదించవచ్చుని కలెక్టరు చెప్పారు.

## 8వ వార్డులో కొనసాగిన మన నగరం మన బాధ్యత



**కర్నూలు హాస్పటల్ మే 13 ప్రభాతవార్త :**
కర్నూలు నగరంలోని 8వ వార్డులో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కొరకంచి రవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మన నగరం మన బాధ్యత కార్యక్రమం పంతొమ్మిదవ రోజు మాసూమ్ బాడ, కురువ వీధి, ఎలుకూరి వారి వీధి, మఠం సందులో కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా స్థానిక వార్డు ఇంచార్జులు, బూత్ ఇంచార్జు లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వార్డు అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, మంత్రి టీజీ భరత్ గుప్తా సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన సేవలు అందిస్తామని టీడీపీ నగర అధ్యక్షులు కొరకంచి రవి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, 8వ వార్డు ఇంచార్జి కురువ పరమేశ్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా అత్తులూరి కృష్ణ కిరణ్

**వెల్దుర్తి,మే 13, ప్రభాతవార్త**



ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయ కులు వెల్దుర్తికి చెందిన అత్తులూరి కృష్ణకిరణ్ వాసవి సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా నియమించడం పట్ల వెల్దుర్తి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య ఆధ్వర్యంలో వాసవి సేవాదళ్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణకిరణ్ వాసవి సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా ఎన్ను కొని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

## పరిశ్రమల అబివృద్ధి ప్రత్యేక చర్యలు

**నంద్యాల, మే 13,ప్రభాతవార్తప్రతినిధి :**
జిల్లాలో పరిశ్రమల స్థాపనకుప్రౌత్సాహిక పారిశ్రామికాబివృద్ధి కి అనుకూల వాతావరణము కల్పించాలని జిల్లా కలెక్టరు రాజకుమారి సంబందిత అదికారులను అదేశించారు. బుదవరాము కలెక్టరేట్లఓని వీడియెయో కాన్ఫరెన్సు హాలుల్లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటి సమావేషముతో పాటు స్కిల్ డెవలప్‌మెంటు ఉపాది కల్పన వివిద సర్వేల పురోగతిపై సమీక్ష సమావేషము నిర్వహించారు. ఈ సమావేషములో జిల్లా పరిశ్రమల మేనేజరుతదితరులు పాల్గొన్నారు.

## పగిడ్యాలలో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

**పగిడ్యాల,మే 13, ప్రభాతవార్త :**



పగిడ్యాలలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఏసు (25) ఉరివేసుకొని బుధవారం రాత్రి 8.30 గంటలకు యువకుడు ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఇంట్లో గడెవేసుకుని చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో చావుకేకలు వేయడంతో తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఏసును కిందికి దించారు. స్థానిక ప్రవేటు వైద్యులు పరిశీలించి ఏసు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఆత్మకూరు పురపాలక సంఘంలో.. ఆగని అక్రమ కట్టడాలు..!

**: యదేచ్ఛగా రోడ్లు మున్సిపాలిటీ స్థలలు కబ్జా**
**: నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు**

**ఆత్మకూరు మే 13 ప్రభాతవార్త:**
పురపాలక సంఘంలో యదేచ్ఛగా డ్రైనేజీ కాలువల పై ఉన్న ఖాళీ స్థలాలు, సీసీ రోడ్ల పక్కన ఉన్న ప్రభుత్వ మిగులు భూములు ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటున్న రోడ్లపై అక్రమ కట్టడాలు రోజురోజుకు పట్టణంలో మితిమీరి పోతున్నాయి యదేచ్ఛగా అక్రమార్కులు పురపాలక సంఘంలో సంత మార్కెట్ సమీపంలో ఆసర్ మసీద్ వీధి నుంచి సాలా వీధికి వెళ్లే సీసీ రోడ్డు పక్కల డ్రైనేజీ కాలువపై మున్సిపాలిటీ అధికారుల హద్దులు తొలగించి యదేచ్ఛగా



అక్రమ కట్టడాలు కట్టేందుకు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు విశ్వనియ సమాచారం 12 అడుగుల రోడ్డు ఉండాల్సిన ఆ ప్రదేశంలో ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన కట్టడాలు ఆగడం లేదంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెలువడుతున్నాయి సచివాలయ ఉద్యోగులు సర్వే చేసి రెడ్ మార్కుతో హద్దులు వేసినప్పటికీ ఆ హద్దులను తొలగించి ఏకంగా డ్రైనేజీ కాలువలపై, సీసీ రోడ్లపై అక్రమ కట్టడాలను ఆగని విధంగా నెలకొంది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ కట్టడాలు జరుగుతున్న నేపథ్యంలో పలు కాలనీలలో ఈ విషయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి ఈ విషయం ఇటీవల కాలంలో స్థానిక ఎమ్మెల్యే కు ఆ కాలనీవాసులు అక్రమ కట్టడాలపై పలువురు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

